ఒక పుర్రె రెండు ఎముకలు

ఎమ్.వి.వి. సత్యనారాయణ

"మీకు మద్రాసునుండి ట్రంక్ కాల్!" అన్నాడు సారథి.

డిటెక్టివ్ శిరీష్ తన అసిస్టెంటువైపు ప్రశ్నార్థకంగా చూసాడు.

"ఎవరో కనుక్కున్నావా?" అడిగాడు శిరీష్.

"మీ ఫ్రెండు చలపతి!" నవ్వాడు సారథి.

శిరీష్ నవ్వాడు. చలపతి ప్రసక్తి వస్తే తమ ఇద్దరికీ హాస్యంగా వుంటుంది.

శిరీష్ చటుక్కున ప్రక్క గదిలోకి పరుగెత్తాడు.

రిసీవర్ చెవిదగ్గర వుంచుకుని, "చలపతీ!" అన్నాడు.

"శిరీష్ భాయ్! నా ప్రాణాలు ప్రమాదంలో పడ్డాయి!" అన్నాడు చలపతి.

శిరీష్ నవ్వాపుకొంటూ, "ఎప్పట్నించి?" అన్నాడు.

"అయిదు నిమిషాల క్రితంనుండీ అనుకుంటాను!"

"వివరంగా చెప్పు!"

"నిన్న అర్థరాత్రి నాకు అకస్మాత్తుగా మెలకువ వచ్చింది. నా కిటికీ అద్దంమీద ఎవరిదో నీడపడింది. నేను లేచిన అలికిడికి అతడు పారిపోయాడు!"

"ఎవరో దొంగ యేమో!"

"తెల్లవారి లేచేసరికి నా గది గుమ్మం ముందు ఒక పుర్రె, రెండు ఎముకలు వున్నాయి."

"మీ డైరెక్టరు జానపదం తీస్తున్నాడా?"

"మా గురువుగారు అసలు అలాంటి సబ్జెక్టు ఎత్తుకోరు?"

"మీ ప్రక్క ఫ్లోర్‌లో ఏదైనా జానపద చిత్రాలు."

"లేదు!"

"అయితే పుర్రె ఎముకలు స్మశానంనుండే ఎవరైనా తెచ్చి గుమ్మంలో పెట్టారంటావా?"

"అవును మట్టి కొట్టుకుపోయి వున్నాయి!"

"ఎవరో నిన్ను ఆటపట్టించడానికి...."

"అలాగే అనుకున్నాను. కాని ఈ రోజు....అయిదు నిమిషాల క్రితం ఒక సంఘటన జరిగింది."

"ఏమిటది?"

"అవుట్ డోర్ షూటింగ్ జరుగుతోంది. మా గురువుగారే ఆ చిత్రం తీస్తున్నాడు. కథా, స్క్రీన్ ప్లే దర్శకత్వం నిర్వహిస్తున్నారు. చిత్రంలో ఒక ముఖ్య పాత్ర కూడా వేస్తున్నారు."

"సంగీతం కూడా నిర్వహించమను."

"నీ సూచన ఆయనకు అందిస్తాను!"

"గుడ్. ఇప్పుడు చెప్పు!"

"అవుట్ డోర్ షూటింగ్‌లో ఒక పెద్ద బండరాయి నా వైపు దొర్లుతూ వచ్చింది. కా స్తలో తప్పుకున్నాను!"

"ఎవరో తోసివుంటారనా నీ అనుమానం?"

"అవును. రాయి వుండవలసిన ప్రాంతంలో పాద లున్నాయి. ఆ పాదల్లో అలికిడయినట్టు నాతోబాటు వున్న సాంకేతిక నిపుణులు చెప్పారు."

"రాతిని తోసినవాడు కనిపించలేదా?"

"లేదు! యూనిట్‌లో అందరూ కంగారు పడ్డారు."

"నీ అనుమానం ఎవరిమీదనో చెప్పు!"

"యూనిట్ అంతా అక్కడే వుంది! అందరూ పరామర్శించారు."

"ఎక్కడినుండి ఫోన్ చేస్తున్నావు?"

"లొకేషన్‌కి దగ్గర్లో నే గెస్టు హౌస్ వుంది! అక్కడి నుండి!"

"నీ మాటలు ఎవరూ వినడంలేదుకదా!"

"ఈ గదిలో ఎవరూ లేరు!"

శిరీష్ నుదురు చిట్లించాడు. చలపతిమీద హత్యా ప్రయత్నం జరిగింది. అతడు చనిపోతే ఎవరికి లాభం? చలపతికి వెనకా ముందూ ఎవరూ లేరు. పదేళ్ళ వయసప్పుడే మద్రాసు పారిపోయాడు. ఈ ఇరవై సంవత్సరాలూ ఏం తిన్నాడో, ఎలా బతికాడో తెలియదు. ఒక ప్రముఖ దర్శకుడి దగ్గర అసోసియేట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నాడు.

"నావల్ల నీకు ఏం సహాయం కావాలి?"

"నా ప్రాణాలను కాపాడాలి!"

"తప్పకుండా."

"ఫోన్‌లో మాట్లాడలేని వ్యవహారం ఒకటి నీతో చెప్పుకోవాలి."

"ఎలా చెబుతావు? నీకు యిటు ప్రక్క షూటింగు

లున్నాయా?"

"లేవు. కాని అటు వస్తాను!"

"ఎప్పుడు?"

"ఈ రోజు ఏప్రిల్ 16. ఈ నెల 20వ తారీఖున కలకత్తాలో ఫిలిం ఫెస్టివల్ వుంది. దానికి నేనూ, మా డైరెక్టర్ గురువుగారు హాజరవుతాం."

"ఫిలిం ఫెస్టివల్‌లో మీ చిత్రం కూడా ప్రదర్శనకు వుందా?"

"అవును. 'ప్రేమ! ప్రేమ! ప్రేమ!' చిత్రం."

"అబ్బ! మూడే పెట్టారేం? ముప్పయిసార్లు ప్రేమ జపం చేయాల్సింది!"

"ప్రేమ అంటే నీకు కోపం ఏమిటి?"

"జీవితంలో యింక ఏమీ లేనట్టు ముసలినటులకు పడుచుపిల్లలకు ప్రేమ! మీ ప్రేమ చిత్రాలు నాకు వాంతి అయేలాగా చేస్తాయి."

"అంత వాంతిగా వుంటే చూడవద్దు!"

"సలహాకి కృతజ్ఞుడిని!"

"నేను ఏప్రిల్ 18 నాటి మెయిలుకి వాల్తేరులో దిగుతాను."

"మెయిల్ మద్రాసునుండి మధ్యాహ్నం ఒంటిగంట పదినిముషాలకు వస్తుంది."

"18 నాటి మెయిలులో నన్ను రిసీవ్ చేసుకోవాలి!"

"రిజర్వేషన్ చేయించుకున్నావా?"

"ఆc! టూ టయర్ కంపార్టుమెంటులో నాలుగో బెర్తు."

"ఆగు. ఎంగేజ్‌మెంట్ చూడనివ్వు!" శిరీష్ తల త్రిప్పి సారధివైపు చూశాడు.

సారథి పాడ్ అందించాడు.

"నాకు 18 నాడు పూర్తి ఎంగేజ్ మెంట్ వుంది."

"కాన్సిల్ చేసుకో ప్లీజ్...."

"వద్దు. పోలీస్ ఉన్నతాధికారుల సమావేశం! ప్రత్యేకంగా పిలిచారు!"

"రైట్! నేను మెయిల్ దిగి లాడ్జి త్రివేణిలో దిగుతాను. నీ సమావేశం ముగియగానే లాడ్జికి వచ్చెయ్."

"తప్పకుండా. నువ్వొక్కడివే వస్తున్నావా?"

"మా డైరెక్టర్ గారూ, ఇతర ముఖ్యులూ అదే రోజు మెయిల్ లో రిజర్వు చేసుకున్నారు మరి! మెయిల్ ఎక్కేవరకూ మా సినిమా మనుషులను నమ్మడానికి లేదు!"

"18 సాయంత్రం నిన్ను త్రివేణిలో కలుస్తాను!"

"తప్పకుండా. ఆ రోజు రాత్రి కోరమాండాల్ కి నన్ను షూరా పంపెయ్యాలి మరి!"

"అలాగే...."

అవతల చలపతి సెలవు పుచ్చుకున్నాడు.

శిరీష్ మెల్లగా రిసీవర్ ను క్రెడిల్ చేశాడు.

"ఏమంటాడు సార్ చలపతి?" అడిగాడు సారథి.

"చలపతిమీద ఈ రోజు బందదొర్లించారు ఎవరో. అతడు మన రక్షణ కోరుతున్నాడు. నువ్వు చేయవలసిన పనివుంది. మెయిల్ కి వెళ్ళి చలపతిని ఫాలో కావాలి. అంతేకాదు...."

"అతడిని ఎవరయినా ఫాలో అయితే వాళ్ళను కూడా గుర్తించాలి."

"గుడ్. మన ఫోటో అల్బం తీసుకురా!"

సారథి ఆల్బంతో ప్రత్యక్షమయ్యాడు.

"నువ్వు చలపతిని చూడలేదు. కాని అతడి హాస్యం తీరుతెన్నులు నీకు బాగా తెలుసు!" శిరీష్ ఒక ఫోటో చూపించాడు.

సారథి ఫోటోవైపు పరీక్షగా చూశాడు.

చలపతి స్ఫురద్రూపి. వంకీల జుత్తు. కుడి పాపిడి. దట్టమైన కనుబొమలు. పల్చటి కోరమీసం. కళ్ళలో చిలిపితనం.

"త్రివేణి లాడ్జిలో అతడు గది తీసుకుంటాడు. అతడి గది దగ్గర నువ్వు కాపలా వుంటావు. నేను సాయంకాలం నాలుగూ అయిదూ మధ్య లాడ్జికి వస్తాను."

"అలాగే సర్!"

2

"చలపతీ!" పిలిచాడు డైరెక్టర్ బోస్.

చలపతి సెట్టులోంచి నడిచి అయిన కుర్చీవద్దకు చేరుకున్నాడు.

"ఈ రాత్రికే మన ప్రయాణం, అవునా?" అడిగాడు బోస్.

చలపతి తలూపాడు.

"సీన్ అరవైలో పన్నెండో షాట్ పాడయింది!"

"ఏమిటి సార్? మీరు స్వయంగా షూట్ చేశారు!"

"అవును. డైలాగ్ లో హీరోయిన్ లెన్స్ లోకి చూచింది!"

చలపతి నిట్టూర్చాడు.

"అప్పలమ్మలు! లక్షలు తీసుకుంటారు బ్లాకులో, ఏమీ నేర్చుకోరు!"

"స్పీడ్ పెరిగిపోయింది సార్! నేర్చుకోవలసిన అవసరం వాళ్ళకు కలగడంలేదు."

"అవును. ఆ మంచి సాంప్రదాయాలు సావిత్రి తరంతోనే పోయాయి!"

చలపతి తలూపి, "నన్ను షూట్ చేయమంటారా సార్?" అన్నాడు.

"అవును."

చలపతి ఉత్సాహంగా షూటింగుకు ఏర్పాటు చేశాడు. నాలుగు రీటేకులతో సీన్ బాగానే వచ్చింది.

బోస్ తృప్తిగా చలపతి భుజం తట్టాడు.

"చలపతిగారూ! మీకు ఫోన్ వచ్చింది!" అన్నాడు లైట్ బాయ్.

చలపతి ఫోన్ వున్న గదిలోకి నడిచాడు.

"చలపతీ!" ఫోన్‌లో ఎవరో పిలిచారు.

"అవును. నేనే!" అన్నాడు చలపతి.

"ఏం చేశావ్?"

"సారీ! నేను చేయలేను!"

"ఆల్ రైట్! నువు స్క్రిప్టు యివ్వలేకపోతే పదివేల రూపాయిలివ్వు!"

"పదివేల రూపాయలా? ఎందుకు యివ్వాలి?"

"ఆ స్క్రిప్టు దొంగిలించడానికి నేను లంచం పెట్టాలి!"

"అంటే నా డబ్బుతో...."

"అవును. నువు స్క్రిప్టు దొంగిలించివుంటే నీకు పదివేల రూపాయలు ఎదురు ఇచ్చేవాడిని."

"నాన్సెన్స్.... నేను గురుద్రోహం చేయను!"

"అయితే అనుభవించు. ఈ సాయంత్రంలోగా నువు పదివేలు రూపాయలు ఇవ్వకపోతే చస్తావ్!"

"ఆఁ!" అవతల క్లిక్‌మన్నది.

చలపతి చెమటలు కక్కసాగాడు. ఈ సాయంకాలమే తన ప్రయాణం. తన దగ్గర అంతా కలిపి అయిదువేల రూపాయిల చిల్లర వుంది బాంకు బాలన్స్. పదివేల రూపాయలు ఎక్కడనుండి తీసుకురాగలడు? తీసుకువచ్చినా అతడికి ఎందుకు యివ్వాలి?

చలపతికి తలలో దీపం వెలిగింది. తనకి ఇప్పుడు ఫోన్ చేసింది ఎవరు?

చటుక్కున చలపతి ఎక్స్ఛేంజ్ కి ఫోన్ చేశాడు.

"మీకు 648 91 నుండి ఫోన్ వచ్చింది" అంది ఆపరేటర్. ఎవరో ఇదే స్టూడియోలో వున్న ఇతర ఫ్లోర్ నుండి ఫోన్ చేశారన్నమాట! ప్రక్క ఫ్లోర్ లో రాధికా పిక్చర్స్ వాళ్ళ షూటింగు జరుగుతోంది.

చలపతి అటు నడిచాడు.

షూటింగు హడావుడిగా వుంది. యూనిట్ లో ప్రతి ఒక్కరూ బిజీగా వున్నారు.

చలపతి టెలిఫోన్ వున్న గదిలోకి నడిచాడు. ఆ గదిలో ఎవరూ లేరు. తనకి ప్రస్తుతం టెలిఫోన్ కాల్ ఇక్కడినుండే వచ్చింది. బల్లమీది మేకప్ సామగ్రి లోంచి ఫేస్ పౌడర్ తీసుకున్నాడు. టెలిఫోన్ సెట్టు మీద చల్లాడు.

సెట్టుమీద వ్రేలిముద్రలు స్పష్టంగా వున్నాయి.

చలపతి గుండెలు గుబగుబలాడాయి. తనని హత్య చేస్తానని బెదిరించినవాడి వ్రేలిముద్రలివి.

చటుక్కున తన ఫ్లోర్ లోకి పరుగెత్తాడు.

స్టిల్ ఫోటోగ్రాఫర్ను బతిమాలుకుని కెమేరా పుచ్చుకున్నాడు. టెలిఫోన్ సెట్టుమీది వ్రేలిముద్రలు ఫోటోలు తీసుకున్నాడు.

3

ఫిలింను స్వయంగా డెవలప్ చేయసాగాడు చలపతి.

మొత్తం ఆరు స్నాప్స్. వేలిముద్రలు స్పష్టంగా వచ్చాయి. అయితే అవి ఎవరివి?

తనకి ఫోన్ చేసిన వ్యక్తి రాధికా ప్రొడక్షన్స్‌కి చెందినవాడా? తన బాస్ వద్ద అపహరించవలసిన స్క్రిప్టు ఎవరికి కావాలి? ఎందుకు? ఆ స్క్రిప్టుతో సినిమా తీయడానికా? లేక బోస్ పేరుప్రఖ్యాతులకు అసూయపడి ఈ ఘోరం తలపెట్టారా?

చలపతి తలలో మెరుపు మెరిసింది.

డెవలపింగ్ రూంలోంచి బయటికి వచ్చాడు.

కెమెరాను మరల ఫిలింతో లోడ్ చేశాడు.

గంట తర్వాత బయటకు నడిచాడు. ఫిలించుట్టను పై జేబులో పెట్టుకున్నాడు.

బట్టలు సర్దుకున్నాడు. సెంట్రల్ స్టేషన్‌కి బయలుదేరాడు.

సెంట్రల్ స్టేషన్ రద్దీగా వుంది. మెయిలు సిద్ధంగా వుంది.

కృష్ణ, వానూ, బోస్ ఇతర చలనచిత్ర ప్రముఖులూ ఎదురయ్యారు. చలపతి తన కూపేలో ఎక్కి కూర్చున్నాడు. అన్యమనస్కంగా వున్నాడు.

"చలపతీ!" పిలిచాడు బోస్.

చలపతికి తల తిరిగిపోయింది. జేబులోంచి ఫిలించుట్ట మాయమయింది. ఫిలించుట్టను ఎవరు తీశారు?

తనను కలుసుకున్నదెవరు! గుర్తుకు తెచ్చుకోవడానికి ప్రయత్నించాడు. అందరూ తనకి బాగా పరిచితులు.

వానూ, బోస్, కృష్ణ, విశ్వం, కెమెరామన్

షణ్ముగం, అసిస్టెంట్ డైరెక్టర్ నందలాల్....వీళ్ళలో ఒకరు తన జేబులోంచి ఫిలించుట్ట దొంగిలించారు. ఆ దొంగే హంతకుడిగా తనని బెదిరిస్తున్నాడా?

"చలపతీ!" బోస్ అతడి భుజంతట్టి, "నీకు నా కూపేలో సీటూ బెర్తూ రిజర్వ్ చేశాను!" అన్నాడు.

"వద్దు సార్! నేను ఒక్కడినీ ఒక్క కూపేలో ప్రయాణం చేస్తాను!" అన్నాడు చెమటలు కక్కుతూ.

"అదేమిటోయ్ చలపతీ!"

"అంతే సార్! నన్ను క్షమించండి!"

కృష్ణ ముందుకు నడిచి, "చలపతీ!" అన్నాడు భావగర్భితంగా.

"కృష్ణా! నువ్వు కూడా నీ ఏర్పాటు చూసుకో!"

చలపతి తన కూపే తలుపు వేసుకున్నాడు. కూపే మొత్తం బుక్ చేసుకోవడం మంచిదయింది.

దొంగిలించిన ఫిలించుట్టలో తన వ్రేలిముద్రలున్నాయి. ఎందుకయినా మంచిదని తానే రెండోసారి తన వ్రేలిముద్రలు ప్రింటువేశాడు. ఇప్పుడు ఆ ఫిలిం పోయింది. అంటే తనని బెదిరించినవాడు తనను ఫాలో అవుతున్నాడు.

అసలు టెలిఫోన్ మీద వ్రేలిముద్రలు ఎయిర్ బాగ్ లో భద్రంగా వున్నాయి.

పావుగంట తర్వాత మెయిలు కదిలింది.

4

టాయ్ లెట్ రూంలో అద్దంముందు నిలబడ్డాడు చలపతి. రాత్రంతా మత్తుగా నిద్రపట్టింది. కూపే లోపలివైపు తాళంపెట్టి పడుకున్నాడు తను. కాంపోజ్

మాత్ర వేసుకోవడం మంచిదయింది.

అద్దంలో తన మొహం తేరుకుంది.

చలపతి కిటికీలోంచి బయటకు చూశాడు. లక్ష్యం వైపు పరుగెత్తే మనిషిలాగా మెయిలు పరుగెత్తుతోంది.

ఉదయం పదకొండు గంటలయింది. మరో రెండు గంటల్లో తాను వాల్తేరులో దిగుతాడు.

కిటికీ మూసి లైటు వేశాడు చలపతి. మేకప్ సామగ్రి తీశాడు. చకచక మేకప్ చేసుకోవడం మొదలుపెట్టాడు. ముప్ఫయి సంవత్సరాల చలపతి నలభైఅయిదు సంవత్సరాలవాడిలాగా తయారయాడు.

బుగ్గమీద చిన్న క్రొవ్వు మడతలు సృష్టించుకున్నాడు. చెంపలూ పాపిడీ నెరిశాయి. కనుబొమలు గ్రేకలర్‌లో వున్నాయి. షర్టువేసి పాంటు టక్ చేశాడు. కళ్ళకు రిమ్‌లెస్ అద్దాలు తగిలించాడు.

తన ప్రతిబింబం సంతృప్తికరంగా మారింది.

మెయిలు అనకాపల్లిలో ఆగింది.

చలపతి కిటికీ కొద్దిగా తెరచి ప్లాట్‌ఫాంమీదకు చూశాడు. ప్రయాణీకులు ఎవరి గొడవలో వాళ్ళున్నారు.

మెయిలు అరగంట తర్వాత వాల్తేరు ప్లాట్‌ఫాం మీద ఆగింది. చలపతి బాగ్ సర్దుకుని పట్టాలమీదుగా దిగేశాడు. అటూ యిటూ చూచి అవతలి ప్లాట్‌ఫాం మీదకు గెంతాడు.

తనని చలపతిగా ఎవరూ గుర్తించలేరు. అందుకే తనని ఎవరూ ఫాలో కావడంలేదు.

ప్లాట్‌ఫాం చివరకు వెళ్ళి పట్టాలమీదుగా తిరిగి మొదటి ప్లాట్‌ఫాంమీదకు వచ్చాడు. చివరిగేటులో

న్న టికెట్ కలెక్టర్ కి టికెట్ అందించాడు.

కలెక్టర్ టికెట్ పరీక్షగా చూచి, 'బ్రేక్ జర్నీ' ని తలూపి సంతకం పెట్టి ఇచ్చేశాడు.

చలపతి బయటకు పరుగెత్తాడు.

టాక్సీ పట్టుకున్నాడు. త్రివేణి లాడ్జిలో అడుగు ట్టాడు. రూం నెంబర్ ఇరవై తాళంచెవులు తీసుకుని యిటర్ తో నడిచాడు.

“వెయిటర్! నువ్వు వెళ్ళు. రూం తెలుసులే నాకు!” న్నాడు చలపతి.

వెయిటర్ తలూపాడు. వెనక్కి తిరిగాడు.

చలపతిలో నడవాలో కదిలాడు. నడవాలో ఎవరూ రు. చలపతి గది తాళం తెరిచాడు. లోపలకు అడుగు ట్టాడు. తలుపు మూశాడు.

అతడి కళ్ళు విచ్చుకున్నాయి.

“నువ్వా?” అన్నాడు చలపతి.

అతడు సమాధానంగా పిస్తోలు తీశాడు. సైలెన్సర్ మర్చాడు.

“చంపు.... తా.... వా?” చలపతి మాట పూర్తి నే లేదు.

సైలెన్సర్ అమర్చిన పిస్తోలు చువ్ చువ్ అంది.

చలపతి కట్టె విరిగినట్టు విరుచుకు పడిపోయాడు. ండెకు తూట్లు పడినట్టు రక్తం చిమ్ముతోంది.

చలపతి భుజాన వున్న ఎయిర్ బాగ్ తీసుకున్నాడు తడు. తలుపు తెరచి బయటకు నడిచాడు.

నడవా ఖాళీగా వుంది.

రూం నెంబర్ పదిముందు ఆగాడు.

5

బలంగా నిట్టూర్చి మెయిల్ ప్లాట్ ఫాంమీద ఆగింది. సారధి ప్రయాణీకులను తప్పించుకుంటూ మెయిల్ కూపేలు వెతుక్కో సాగాడు.

నాలుగో నెంబర్ కూపేముందు ఆగాడు.

కూపే ఖాళీగా వుంది. కూపేమీద చలపతి పేరు వుంది.

సారధి ప్లాట్ ఫాంమీదకు చూశాడు. జేబులోంచి చలపతి ఫోటోతీసి ప్రయాణీకులలో వెతుకుతోన్నాడు.

పది నిముషాలు గడిచాయి.

ప్రయాణీకులు పల్చబడ్డారు.

సారధి స్టేషన్ బయటకు నడిచాడు.

చలపతి వాల్తేర్ వరకూ రాలేదా? మధ్యలో ఎక్కడయినా దిగిపోయాడా? లేకపోతే వాల్తేర్ వరకూ వచ్చి నాన్సెన్స్....తను పప్పులో కాలేశాడు. చలపతి ప్రాణ భయంతో బయలుదేరాడు. స్టేషన్ కి శిరీష్ రిసీవ్ చేసుకోవడానికి రానని చెప్పాడు. చలపతిని ఎవరో మాయంచేసి వుండాలి. లేదా చలపతి అందరి కళ్ళు కప్పి....

రైట్....ప్లాట్ ఫాం అవతలివైపు దిగి లాడ్జికి చేరుకుని వుంటాడు. సారధి బయట పార్క్ చేసివున్న స్కూటర్ ను సమీపించాడు.

లాడ్జి త్రివేణి మేనేజర్ అతడిని విష్ చేశాడు.

రూం తాళాలు తగిలించే బోర్డు చూశాడు సారధి.

రూం నెంబర్ ఇరవైలో చలపతి దిగాడు. సారధి మేనేజర్ వైపు చూశాడు.

"రూం నెంబర్ ఇరవై ఎంతసేపు క్రితం బాక్

అయింది?" అడిగాడు సారధి.

"పదిహేను నిముషాలు!"

సారధి తలూపి రూంస్ వైపు నడిచాడు.

6

టెలిఫోన్ గణగణలాడింది.

పోలీస్ కమీషనర్ తన అతిథులవైపు చూశాడు. పోలీస్ ఇన్స్పెక్టర్లూ, సబ్ ఇన్స్పెక్టర్లూ, క్రైంబ్రాంచ్ ఇన్స్పెక్టర్లూ, డిటెక్టివ్ శరీఫ్ ఆయనవైపు ప్రశ్నార్థకంగా చూశారు.

పోలీస్ కమీషనర్ తల పంకించాడు.

ఈ సమావేశం అతి రహస్యంగా ఏర్పాటు చేసిన సమావేశం. ఇక్కడ ఎవరికి ఈ ఫోన్ వచ్చినట్టు?

తటపటాయించి చివరకు పోలీస్ కమీషనర్ రిసీవర్ ఎత్తి, "హాలో...." అని వూరుకున్నాడు.

"డిటెక్టివ్ శరీఫ్ గారున్నారా సార్?"

"మీరెవరు?"

"ఆయన అసిస్టెంట్ సారధిని సార్!"

"ఉన్నారు. ఏం గావాలి?"

"లాడ్జి త్రివేణిలో హత్య జరిగింది సార్!"

పక్కలో బాంబు పడినట్టు చూశాడు కమీషనర్.

"ఎవరిని హత్య చేశారు?"

"చలపతిని."

"చలపతా? అతదెవరు?"

"ప్రఖ్యాత చలనచిత్ర దర్శకుడు బోస్ కు చలపతి అసోసియేట్ దర్శకుడు."

"నువు అక్కడికి ఎందుకు వెళ్ళావు?"

"సార్! ఈ ప్రశ్నలన్నింటికీ ఇక్కడికి వచ్చాక

చెబుతాను, అన్నట్టు మీరు...."

"అయిదు నిమిషాల్లో అక్కడుంటాం" అని రిసీవర్ను క్రెడిల్ చేశాడు కమీషనర్.

"లాడ్జి త్రివేణికి వెళ్దాం. అక్కడో హత్య జరిగింది" అని సమాధానం కోసం ఎదురు చూడకుండా బయటికి నడిచాడు.

పోలీస్ వాహనాల్లో పోలీస్ అధికార్లూ, డాట్సన్ కారులో డిటెక్టివ్ శిరీష్ బయలుదేరారు.

లాడ్జి త్రివేణిలో హోటల్ సిబ్బంది అంతా వరండాలో గుమిగూడారు. సారధి రూం నెంబర్ 20 ముందు నిలబడి వున్నాడు. ఎవరినీ తలుపులు తాకకుండా జాగ్రత్తపడుతున్నాడు. పోలీసులను చూడగానే సిబ్బంది దారి ఇచ్చారు.

రూం నెంబర్ ఇరవైలో పడివున్నాడు చలపతి. వెల్లకితలా పడివున్నాడు. గుండె ప్రాంతంలోంచి రెండు రంధ్రాలద్వారా రక్తం ప్రవహించి గడ్డకట్టివుంది. కండ్లూ పెదిమలూ ఆశ్చర్యసూచకంగా తెరుచుకుని వున్నాయి. వ్రేలిముద్రల నిపుణులు గదిలో వ్రేలిముద్రలు పడే ప్రాంతాలన్నింటిమీదా పౌడర్ స్ప్రే చేయడం మొదలు పెట్టారు.

చలపతి తనకి ఫోన్ చేయడం దగ్గరనుండీ, సారధిని అతడిమీద నిఘాకోసం పంపేటంతవరకూ విడమరచి చెప్పాడు శిరీష్.

సారధి తాను రైల్వేస్టేషన్లో చలపతికోసం వెతుక్కోవడం గురించి చెప్పాడు. చివరకు రూం నెంబర్ ఇరవైముందుకు రావడంతో శవం కనిపించినట్టు చెప్పాడు.

వ్రేలిముద్రల నిపుణులు వ్రేలిముద్రలు సేకరించు

కున్నట్టుగా కమీషనర్‌కి తెలియపరిచారు.

పోలీస్ సర్జన్ శవంముందు గొంతుక్కూర్చున్నాడు. చెయ్యి అందుకున్నాడు. పరీక్ష ముగిశాక

"ఇప్పుడు 2-15 అయింది. హత్య జరిగి గంటకిపైగా గంటన్నరకి తక్కువగా అయి వుండాలి. శవంలో ఇంకా గది టెంపరేచర్ ఎక్జిస్ట్ అవుతోంది" అన్నాడు.

వ్రేలిముద్రల నిపుణులు లాబ్‌కి వెళ్ళిపోయారు.

డిటెక్టివ్ శిరీష్ గదిలో కలియ తిరిగాడు. ఆశ్చర్యంగా చూశాడు.

"చలపతి మద్రాసునుండి వచ్చాడు. తిరిగి ఈ రాత్రికి కోరమాండల్ ఎక్స్‌ప్రెస్సుకి హవ్‌రా వెళ్తాడు. అంటే అతడి వెంట సూట్‌కేసో ఎయిర్ బాగో వుండాలి" అన్నాడు శిరీష్.

"కరెక్టు!" తలూపాడు పోలీస్ కమీషనర్. "మిస్టర్ శిరీష్! కేసులో మీరు ప్రొసీడవండి. మిస్టర్ కుమార్ — అంటే క్రైంబ్రాంచ్ ఇన్స్‌పెక్టర్ మీకు సహకరిస్తారు!" అన్నాడు.

శిరీష్ అంగీకారపూర్వకంగా తలూపాడు.

సారధిని పిలిచి, "హోటల్ మేనేజర్‌నూ, వెయిటర్‌నూ పిలుచుకురా!" అన్నాడు శిరీష్. "రిజిస్టర్‌ను కూడా తీసుకు రమ్మను!"

సారధి బయటకు నడిచాడు.

"శవాన్ని ఆంబులెన్సులో తరలించండి!" అన్నాడు కమీషనర్.

"ఒక్క అయిదు నిముషాలాగ్సర్!" అన్నాడు శిరీష్.

"ఎందుకు?"

"చలపతి వస్తువులు మాయమయాయి. ఆ విషయం

హోటలువాళ్ళు నిరాకరిస్తారు" శిరీష్ మాట ముగియక ముందే హోటల్ మేనేజరూ వెయిటరూ వచ్చారు.

హోటల్ రిజిష్టర్ తిరగవేసి చూశాడు శిరీష్.

ఒంటిగంటా ముప్ఫయి నిమిషాలకు చిలపతి గదిని తీసుకున్నట్టు సంతకం పెట్టాడు.

"చలపతి తనవెంట ఏ సామాను తీసుకువచ్చాడు?" అడిగాడు శిరీష్.

వెయిటర్ మెల్లగా దగ్గి, "ఎయిర్ బాగ్ తెచ్చుకున్నారాసార్! నన్ను తాకనివ్వలేదు!" అన్నాడు.

"అతడిని రూంలో దించావా?"

"నడవాలోనే నన్ను వెనక్కి పంపేశారు సార్!"

"ఎయిర్ బాగ్ ఎలాంటిది?"

"నల్లటి ఎయిర్ బాగ్ సార్!"

"అదే ఎయిర్ బాగ్ తో రెండు గంటలకుముందే ఎవరైనా బయటికి నడిచారా?"

వెయిటర్ ఆలోచనలో పడ్డాడు.

మేనేజర్ ఆలోచించుకుని, "ఎలా చెప్పగలనుసార్? అంతకుముందే అటువంటి ఎయిర్ బాగ్ తో మరొకరు వచ్చారు సార్!" అన్నాడు.

"గుడ్! ఎవరు?"

"జాన్, లింకన్."

"ఇద్దరా? ఏ గదిలో దిగారు?"

మేనేజర్ రిజిష్టర్ తిరగవేశాడు. "డబుల్ రూం, సార్! రూం నెంబర్ 10" అన్నాడు.

శిరీష్ రిజిష్టర్ లోకి చూశాడు. జాన్, లింకన్ ఇద్దరూ ఒంటిగంట ఇరవై నిముషాలకు గదిలో దిగారు. అంటే చలపతి దిగడానికి పదినిముషాలు ముందన్నబాట!

"సారధీ! ఒక్కసారి రూం నెం. 10కి వెళ్ళిరా. వెయిటర్‌ను వెంటపెట్టుకు వెళ్లు!" అన్నాడు శిరీష్.

సారధి కదలి వెయిటర్ వెంటరాగా బయటకు నడిచాడు.

"మేనేజర్ గారూ! రెండుగంటల ముందుగా జాన్, లింకన్‌లలో ఎవరయినా బయటికి వెళ్ళారా?" అడిగాడు శిరీష్.

"జాన్ వెళ్ళాడు. తరువాత లింకన్ వెళ్ళాడు. జాన్ భుజాన మాత్రమే బాగ్ వ్రేలాడుతోంది."

"అంటే ఒకరి వెనుక ఒకరు పారిపోయారన్నమాట!"

"పారిపోయి వుండర్సార్. బాగ్ రిపేర్ కన్నట్లు మాట్లాడుకుంటూ వెళ్ళారు. పైగా ఇద్దరూ పాంటులు వేసుకువచ్చారు. రిపేర్‌కి వెళ్ళేటప్పుడు లుంగీలతో వెళ్ళారు" అని వాళ్ళ రూపురేఖలు కూడా వర్ణించి చెప్పాడు మేనేజరు.

శిరిష్ తల పంకించాడు. ఆ రూపురేఖలు వాళ్ళ మారు వేషాలు కావచ్చు.

సారధి వచ్చాడు.

"రూం నెం. పదిలో నల్లటి ఎయిర్ బాగ్ వుంది సార్! బాగ్‌లో ఏమీ లేవు" అన్నాడు సారధి.

"వ్రేలిముద్రలు చెరపలేదు కదా!"

"లేదు సార్!"

శిరీష్ సాభిప్రాయంగా పోలీస్ కమీషనర్ వైపు చూశాడు. "శవాన్ని ఒకసారి వెతుకుతాను! అనుమతించండి!" అన్నాడు శిరీష్.

పోలీస్ కమీషనర్ అంగీకరించాడు.

క్రైంబ్రాంచ్ ఇన్స్‌పెక్టర్ కుమార్‌తో కలసి

శవాన్ని వెతికాడు శిరీష్. శవం వీపు భాగంలో ప్లాస్టర్ అంటించి ఫిలిం దొరికింది. శిరీష్ నెగెటివ్ ఫిలిం విప్పి చూశాడు.

నెగెటివ్ ఫిలింలో టెలిఫోన్ సెట్టు క్లోజప్‌లో అచ్చు అయివుంది. సెట్టుమీద వ్రేలిముద్రలున్నాయి. నల్లటి పొడి చల్లినట్లు వ్రేలిముద్రల చారలు.

“మేనేజర్ గారూ! మనం రూం నెం. పదిలోకి వెళ్దాం!” అన్నాడు కుమార్.

మేనేజర్ తలూపి బయటకు కదిలాడు.

“కమీషనర్ గారూ! శవాన్ని మార్చ్యురీకి తరలించవచ్చుననుకుంటాను!” అన్నాడు శిరీష్.

కుమార్, శిరీష్ బయటకు నడిచారు.

రూం నెం. పది ముందు ఆగారు.

“ఈ గదిలో కూడా వ్రేలిముద్రలుంటాయి!” అన్నాడు శిరీష్.

7

“కుమార్! నువ్వు నీ సిబ్బందితో పట్నంలో గాలించాలి. జాన్, లింకన్‌లు పట్నం వదలిపెట్టరు” అన్నాడు శిరీష్.

కుమార్ తలూపాడు. “రెండు గంటలకుముందు ఇద్దరూ లుంగీ పంచెలతో బయటకు వెళ్ళారు. వాళ్ళవెంట నల్లటి ఎయిర్ బాగ్ వుంది. బహుశా యిద్దరూ టాక్సీ ఎక్కి వెళ్ళిపోయి వుంటారు!”

“అవును సమీపంలో వున్న టాక్సీ స్టాండ్‌కి వెళ్ళు. లేదా దారినపోయే ఖాళీ టాక్సీ ఎక్కి వుండవచ్చు. నగరంలోని టాక్సీ డ్రైవర్ల లాగ్ బుక్స్ తణిఖీ చెయ్యి.”

కుమార్ బూట్లు టకటకలాడించుకుంటూ బయటకు

వెళ్ళిపోయాడు.

డిటెక్టివ్ శిరీష్ ఆలోచనలో పడ్డాడు.

చలపతికి ముప్ఫయి సంవత్సరాలుంటాయి. కాని నలభై అయిదు సంవత్సరాలవాడికిలాగా మేకప్ చేసుకున్నాడు? హంతకుడి బారినుండి తప్పించుకోవడానికా? అంటే హంతకుడు అతడి వెంట బయలుదేరినట్టు చలపతి నిర్ధారించుకున్నాడా? అందుకేనా కూపేలో ఒక్కడూ వున్నాడు.

ఆశ్చర్యం! మద్రాసునుండి వాల్తేరులోపులో ఒక్కడిని హత్య చేయలేకపోయారా? హంతకులిద్దరూ! ఆ విషయం స్పష్టమవుతోంది.

లేక లాడ్జి త్రివేణిలోనే చంపడంలో ఏమైనా అంతరారం వుందా? ఈ హత్య విషయంలో హోటల్ సిబ్బంది సహకారం వుందా? హంతకులు మద్రాసునుండి వచ్చింది ఎప్పుడు? మెయిల్ కేనా? అయితే హోటల్ సిబ్బందితో ప్రమేయం అంత సులువుగా ఎలా పెట్టుకోగలిగారు?

శిరీష్ తల విదిలించాడు.

చలపతి మొహంలో ఆశ్చర్యం గోచరించింది. హంతకుడు లేదా హంతకులు అతడికి బాగా తెలిసిన వాళ్ళు?

వాచీ చూసుకున్నాడు శిరీష్.

సాయంత్రం అయిదవుతోంది. హత్య జరిగి షుమారు మూడుగంటలవుతోంది.

డాట్సన్ కారును బయలుదేరతీశాడు శిరీష్.

ఫోరెన్సిక్ లాబ్ ముందాపాడు కారు. వేలిముద్రల విభాగంలో ప్రవేశించాడు.

వ్రేలిముద్రల నిపుణులు అతడిని విష్ చేశారు.

"ప్రింట్సు వేశాం. చూస్తారా?" అడిగాడు ఒక నిపుణుడు.

"వచ్చిందే అందుకోసం!"

నిపుణుడు అతడికి ఫోటోల సెట్టు అందించాడు.

8

సారథి ఓపిగ్గా కాచుక్కూర్చున్నాడు.

నగరం మొత్తం మీద ఇంకా పదిమంది టాక్సీ డ్రయివర్లున్నారు. వాళ్ళ లాగ్ బుక్స్ వెతికితే సరిపోతుంది.

ఇద్దరు టాక్సీ డ్రయివర్లు తమతమ వాహనాలతో వచ్చారు.

సారథి వాళ్ళను సమీపించి తన గుర్తింపు కార్డు చూపించాడు.

"ఏం కావాలి సార్?" అడిగారు టాక్సీ డ్రయివర్లు.

"మీ లాగ్ బుక్స్ చూపించాలి!" అన్నాడు సారథి.

ఇద్దరూ లాగ్ బుక్స్ చూపించారు.

లాడ్జి త్రివేణినుండి జీవన్ ప్రకాష్ (ఎల్. ఐ. సి. భవనం) వరకూ మొదటివాడు సవారీ తోలాడు.

సారథి కళ్ళు మెరిశాయి.

"లాడ్జి త్రివేణి వద్ద నువ్వు ఇద్దరు వ్యక్తులను టాక్సీ ఎక్కించుకున్నావుకదా!" అడిగాడు సారథి.

"అవున్సార్! వాళ్ళిద్దరు తమిళం మాట్లాడుకున్నారు."

"లుంగీ పంచెలు కట్టుకున్నారా?"

"అవున్సార్!"

"వాళ్ళలో ఒకడు నల్లటి ఎయిర్ బాగ్ మోశాడా?"

"అవునండి."

"రైట్ వాళ్ళను ఎక్కడ దింపావు!"

"ఎల్.ఐ.సి. భవనం దగ్గర."

"వాళ్ళు అక్కడే దిగారు. లాగ్ బుక్‌లో తెలుస్తోంది. కాని వాళ్ళు సవారి ఎక్కడికని అడిగారు?"

"డ్రెడ్జింగ్ కార్పొరేషన్."

సారథి ఆలోచనలోపడ్డాడు. వాంతకులకు ఆ సంస్థలో పని ఏమిటి? ఎల్.ఐ.సి. భవనంలో షాపింగ్ కాంప్లెక్స్ ఇతర ఆఫీసుల సముదాయమూ....

"ఆ తరువాత వాళ్ళను చూశావా?"

"లేదు సార్! వాళ్ళు దిగి భవనంవైపు మొహాలు పెట్టి నిలబడ్డారు. నాకు మరో బేరం తగిలింది. అటు వెళ్ళిపోయాను."

సారథి అతడికి కృతజ్ఞతలు చెప్పి స్కూటర్ ఎక్కాడు.

ఎల్.ఐ.సి. భవనం ముందు ఆపాడు.

డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫీసు పై అంతస్తులో వుంది. సారథి లిఫ్టుద్వారా పై అంతస్తు చేరుకున్నాడు.

ఆఫీస్ రూంకి ఇవతల గాజు అద్దాల తలుపులు.

తలుపులకు ఇవతల యూనిఫాంలో ప్యూన్ కూర్చున్నాడు.

సారథి అతడిని సమీపించాడు.

జాన్, లింకన్‌ల వేషం వర్ణించారు.

"లుంగీలు కట్టుకుని ఇద్దరు ఒక ఎయిర్ బాగ్‌తో వచ్చారు. గుర్తుందా?" అడిగాడు సారథి.

"లేదు బాబూ!" అన్నాడు ప్యూన్.

"ఇంకా ఎవరైనా చూచివుండవచ్చునేమో!"

"ఆ అవకాశంలేదు. మధ్యాహ్నం పన్నెండుగంటల నుండి ఇక్కడే వున్నాను. నాకు ఇంటర్వ్యూ స్లిప్ ఇవ్వకుండా లోపలకు వెళ్ళడానికి లేదు."

సారధి తలూపి, తిరిగి క్రిందకు వచ్చాడు.

ప్యూన్ చెప్పిన విషయం నిజమేననిపిస్తోంది. హంతకులు మద్రాసునుండి వచ్చారు. వాళ్ళకు అతడి ఆఫీసులో పని ఏముంది?

గ్రవుండ్ ఫ్లోర్ లోకి నడిచాడు.

దాదాపు మూడుగంటల తర్వాత హంతకులు ఆచూకీ ఎవరు చెప్పగలరు?

సారధి తన స్కూటర్ ను సమీపించాడు.

9

కుర్చీలో ముందుకు వాలాడు కుమార్.

శిరీష్ వ్రేలిముద్రల ఫోటోలు బల్లమీద పరిచాడు. మొత్తం మూడుసెట్ల ఫోటోలు.

ఒక సెట్టు ముద్రలు టెలిఫోన్ సెట్టుమీద వున్నాయి.

రెండో సెట్టు తలుపులమీదా తలుపు వెనుక గోడల మీదా వున్నాయి.

మూడోసెట్టు ఎయిర్ బాగ్ మీదా సింగిల్ కాట్ మీదా వున్నాయి. మొదటి సెట్టు వ్రేలిముద్రలు చలపతి తీసిన ఫిలింలోవి.

"మూడో సెట్టులోనూ ఒకడి వ్రేలిముద్రలు కామన్ గా వున్నాయి. రెండో సెట్టులోనూ, మూడో సెట్టులోనూ వాడి వ్రేలిముద్రలతోబాటు మరొకడి వ్రేలిముద్రలున్నాయి. అంటే చలపతికి మద్రాసులో బెదిరింపు చర్యగా హంతకుడు ఫోన్ చేసి వుంటాడు. చలపతి హంతకుడిని చూచాయగా గుర్తించాడు. అందుకే

చలపతి చనిపోయేటప్పుడు కూడా హంతకుడిని కనిపెట్టిన ఆశ్చర్యం ప్రకటించాడు" అన్నాడు శిరీష్.

కుమార్ తలూపాడు.

"అయితే మన పరిశోధనా రంగం మద్రాసుకు తరలించాలి!" అన్నాడు.

"కుమార్! నువ్వు ఫిలిం ఫెస్టివల్ విషయం మర్చిపోయావు."

"మర్చిపోలేదు. సినీ రంగం అంతా కలకత్తా తరలి వెళుతోందా?"

"అంతా వెళ్ళకపోయినా హెచ్చుమంది కలకత్తా వెళ్ళారు. సెక్స్ ఫిక్చర్లు హుందాగా చూచే అవకాశం కదా!"

"చలపతికి సంబంధించి అక్కడ అంటే మద్రాసులో సమాచారం లాగవచ్చును."

శిరీష్ తలపంకించి, "రైట్ కుమార్! చలపతిమీద బండరాయి దొర్లించి హంతకుడు ప్రయత్నం చేశాడు. ఆ విషయంతోబాటు చలపతి ప్రవర్తనా, హంతకుడికి అతడిమీద కసీ — ఈ రహస్యాలన్నీ తెలుస్తాయి!" అన్నాడు.

"అందుకే మనం మద్రాసు వెళ్ళి...."

"హంతకులు మన నగరం వదిలి వుండరు. ఇక్కడ ఏర్పాట్లు చేసి...."

"బస్సు స్టాండులూ, రైల్వేస్టేషన్‌లూ...."

టెలిఫోన్ గణగణలాడింది.

మాట్లాడటం ఆపి కుమార్ ఫోన్ ఎత్తాడు.

"హైవే ప్రక్కనే వున్న పబ్లిక్ టెలిఫోన్ బూత్ నుండి సార్. నేను పి.సి. 84ని మాట్లాడుతున్నాను.

కైలాసపూర్ క్వార్టర్స్ ప్రక్కగా వున్న రోడ్లో మురికాల్వలువ వుందిసార్! ఆ కాలువలో రెండు లుంగీలూ, ఒక నల్లటి ఎయిర్ బాగ్ పడివున్నాయి సార్!"

"వాటిని ఎవరు చూశారు?"

"నేనే సార్, హైవేమీద నాతోబాటు కొంత మందిని కమీషనర్ గారు గస్తీ వేశారు సార్!"

"వాటిని ఎవరూ తాకకుండా చూడు. పావు గంటలో వస్తున్నాం!"

"అలాగే సార్!"

కుమార్ రిసీవర్ పెట్టేశాడు.

"కుమార్! హంతకులకు హైవేమీద పని ఏమిటి?"

"ఏం చెబుతాం! డ్రెడ్జింగ్ కార్పొరేషన్లో మాత్రం పని ఏమిటి?"

"ఆల్ రైట్! నువ్వు బట్టల విషయమూ, బాగ్ విషయమూ చూడు. నేను కలకత్తా వెళ్తాను. నువ్వు మద్రాసు వెళ్తావో, సమాచారం రప్పిస్తావో నీ బాధ్యత!"

కుమార్ తలూపాడు.

"కలకత్తాలో నేను 'ఈస్టు వెస్టు' హోటల్లో బసచేస్తాను. ఫోన్ చెయ్యి" శిరీష్ లేచాడు.

వ్రేలిముద్రల ఫోటోలు తీసుకున్నాడు శిరీష్.

"మరో సెట్టు ఫోటోలు నువ్వు తీసుకువెళ్ళు. పనికి రావచ్చు."

కుమార్ ఒళ్లమీద గుద్దాడు.

"శిరీష్ మనం ఒక విషయం మరచిపోయాం. టెలిఫోన్ సెట్టుమీద చలపతి వ్రేలిముద్రలు ఫోటోలు

తీశాడు. ఆ ఫోటోల్లో టెలిఫోన్ నెంబర్ కూడా ప్రింటయింది."

శిరీష్ నవ్వాడు.

"ఆ ఫోన్ నెంబర్ వాహినీ స్టూడియో రెండో ఫ్లోర్ లోది. ప్రస్తుతం అక్కడ రాధికా ప్రొడక్షన్స్ వాళ్ళ పిక్చర్ షూటింగవుతోంది!"

"అంటే నువు ఫోన్ చేసి కనుక్కున్నావన్నమాట!"

"అప్పుడే తెలిసింది—చిత్ర రంగం కదలి కలకత్తా వెళ్ళిందని."

కుమార్ బయటకు నడిచాడు.

10

కోరమండల్ ఎక్స్‌ప్రెస్ దిగాడు శిరీష్. హౌరా స్టేషన్ లోంచి బయటకు నడిచాడు. టాక్సీ మాట్లాడుకుని ఈస్టు వెస్టు హోటల్ కి చేరుకున్నాడు.

కాలకృత్యాలు తీర్చుకుని ట్రింగా తయారయాడు.

'కలకత్తా డెయిలీ' పత్రికకు ఫోన్ చేశాడు.

"ఫిలిం ఫెస్టివల్ రేపటినుండీ ప్రారంభమవుతుంది. నేషనల్ థియేటర్ లో" అన్నాడు పత్రిక ఎడిటర్.

"ప్లీజ్. టైమింగ్స్ తెలుసా?"

"ఉదయం తొమ్మిది గంటలకు. సాంస్కృతిక వ్యవహారాల కేంద్రమంత్రి ప్రారంభోత్సవం చేస్తారు."

"మద్రాసు చలనచిత్ర ప్రముఖులు ఏ హోటల్ లో దిగారో తెలుసా?"

హోటల్ మొత్తం కాంట్రాక్ట్ తీసుకున్నారు. వంగబంధు హోటల్."

"అడ్రసు చెబుతారా!"

"149—2/సి జగదీష్ రోడ్. హజారా బ్రిడ్జికి ఉత్తరంగా రెండు మైళ్ళలో వుంటుంది."

"థాంక్యూ వెరీమచ్!" శిరీష్ బయటకు నడిచాడు. టాక్సీలో వంగబంధు హోటల్ చేరుకున్నాడు. నాలుగంతస్తుల భవనం "డైరెక్టర్ బోస్‌గారి రూం నెంబర్ ఎంత?" అడిగాడు కౌంటర్‌లో.

"నాలుగో అంతస్తు. రూం నెంబర్ నూట ఇరవై" అన్నాడు కౌంటర్లోని గుమస్తా.

లిఫ్టు ఎక్కి నాలుగో అంతస్తు చేరుకున్నాడు శిరీష్. డైరెక్టర్ బోస్ గదిలోనే దొరికాడు. బల్లముందు కూర్చుండి స్క్రిప్టు రాసుకుంటున్నాడు.

శిరీష్‌ను సాదరంగా ఆహ్వానించాడు.

"మీ గురించి అప్పుడప్పుడూ శంకరరాజన్ చెబుతారు" అన్నాడు బోస్.

శంకరరాజన్ వాహిరా స్టూడియో అధినేత.

శిరీష్ నవ్వి "మాయామైన మునలి పాము—కేసులో ఆయనతో స్నేహం బాగా పెరిగింది!" అన్నాడు.

"బోస్ తలూపి ఫిలిం ఫెస్టివల్ కి వచ్చారా?" అన్నాడు.

"లేదు. మీకోసమే వచ్చాను."

"నిజమా?"

"అవును. మీ పని డిస్టర్బ్ చేసినట్టు భావించకపోతే నాకో అరగంటపాటు కేటాయించాలి!"

"తప్పకుండా. మీరు నాతో పాటు ఫెస్టివల్‌లో పాల్గొంటే ఇంకా సంతోషిస్తాను!"

"మీ అభిమానానికి కృతజ్ఞుడిని! చలపతి మీతో పాటు మద్రాసునుండి బయలుదేరారు అవునా!"

"ఓ! చలపతి మీ స్నేహితుడు కదా!"

"అవును."

"నాతో బాటు బయలుదేరాడు కాని, కూపేలు వేరు!"

"బయలుదేరే ముందు అతడి ప్రవర్తన ఎలా వుంది?"

"విచిత్రంగా వుంది. అతడికి నా కూపేలో నాలుగో బెర్త్ రిజర్వు చేయించాను. కాని అతడు కూపే మొత్తం ఎలా బుక్ చేసుకున్నాడో తెలియదు!"

"అవును. నాకు ఫోన్‌లో చెప్పినప్పుడు అదే బెర్త్ నెంబరు చెప్పాడు."

"అంతేకాదు. సెంట్రల్ స్టేషన్‌లో మొదట బాగానే పలకరించాడు. తరువాత ఏదో విలువయిన వస్తువును పోగొట్టుకున్నట్టు ప్రవర్తించాడు. వెర్రిగా పరుగెత్తి తన కూపేలో దూరాడు. తలుపు వేసుకున్నాడు.

"చలపతి తనను ఎవరో హత్య చేస్తారని భయపడ్డాడు."

"హత్యా? అతడినా? ఎవరు? ఎందుకు?"

"ఎందుకో తెలియదు. కాని బాగా తెలిసినవాళ్లే అని మాత్రం చెప్పగలను."

"తెలిసినవాళ్ళా!"

"అవును. అతడికి మద్రాసులో శత్రువులున్నారా?"

"మాది నటనా ప్రపంచం. నటన పులుముకున్న మొహాల వెనుక ఏం వుందో చెప్పలేం!"

"మద్రాసునుండి చలపతిని వాల్తేర్ వరకూ ఇద్దరు వ్యక్తులు వెంటాడారు. వాల్తేరులో దిగిన అరగంటలో చలపతిని హత్య చేయగలిగారు."

బోస్ దిగ్గున లేచాడు. "చలపతిని హత్య చేశారా?"

దాదాపుగా అరచినంత పనిచేశాడు.

"అవును. లాడ్జి త్రివేణిలో చంపారు."

"నమ్మలేకుండా వున్నాను!"

"మీకు తెలిసిన వివరాలు చెబితే ఇద్దరు హంతకులను త్వరగా పట్టగలను!"

బోస్ నీరసంగా కుర్చీలో కూలబడ్డాడు. "చలపతిని అసోసియేట్ డైరెక్టర్‌గా శ్రద్ధగా మలచుకున్నాను. అలాంటి కుడి భుజం జారిపోయిందంటే...." గొణుక్కున్నాడు.

"చలపతికి దురలవాట్లున్నాయా?"

"ఫీల్డులో సహజం!"

"అతడు సన్నిహితంగా తిరిగే ఫ్రెండ్స్ ఎవరు?"

"రాసుకుంటారా?"

"ఆఁ!" శిరీష్ నోట్ బుక్ తీశాడు.

"మా లైట్ బాయ్ జయరావ్, అసిస్టెంట్ ప్రొడక్షన్ మేనేజర్ అనిల్, వాఘిరా ప్రొడక్షన్ వాళ్ళ మ్యూజిక్ అసోసియేట్, రాధికా ప్రొడక్షన్స్ వానూ, ఎక్స్‌ట్రా నటులు సప్లయర్ జంబులింగం, రాణీ మూవీస్ వాళ్ళ కాషియర్ కృష్ణా, ఇంకా నటుల్లో కొందరూ వున్నారు."

"నటుల పేర్లు కూడా చెప్పండి."

"మోజెస్, రంజా, కాంతయ్య, లింగారావ్, సుబ్బరామయ్యా!"

"అవుట్‌డోర్ షూటింగ్‌లో చలపతిమీద హత్యా ప్రయత్నం జరిగిందట కదా!"

"హత్యా ప్రయత్నమా? ఏమిటది?"

"అతడు ఏదో సీన్ చిత్రీకరిస్తోంటే బండరాయి

దొర్లుకుంటూ వచ్చిందట కదా!"

"ఎప్పుడు?"

"ఈ నెల 16వ తేదీన."

"షెడ్యూల్‌లో అసలు అవుట్ డోర్ షూటింగే లేదు!"

ఈసారి తెల్లబోవడం శిరీష్ వంతయింది. అయితే చలపతి అబద్ధం చెప్పాడా! ప్రాణాలు రక్షించమని చెప్పి అబద్ధం ఎందుకు చెప్పాడు? చలపతి తనతో ఒక ముఖ్య విషయం చెబుతానన్నాడు. ఏమిటది? ఆ విషయం చెప్పేముందు తను పూర్తిగా కేసులో దిగడానికి అబద్ధం చెప్పాడా? అతడు పూర్తిగా ప్రమాదంలో యిరుక్కున్నట్టు తాను భావించాలా?

చలపతి జోక్స్ వేసే మనిషి. తనతో కూడా జోక్ చేశాడా?

"చలపతి మద్రాసులో ఎవరినయినా ప్రేమించాడా?" అడిగాడు శిరీష్.

"లేదనుకుంటాను."

"స్త్రీ వ్యసనం వుందా?"

"అది అక్కడ అందరికీ సహజమే!"

"అతడు ఇటీవల ఎవరితోనయినా ఘర్షణపడ్డాడా?"

"లేదు."

"విధి నిర్వహణలో ఏమరుపాటుగా వుండటం జరిగిందా?"

"ఒక పదిరోజులుగా తాబోలు కొద్దిపాటి పరాకు ప్రదర్శిస్తోన్నాడు."

"ఎందుకో అడిగారా?"

"అడిగాను. మనసు బాగుండలేదన్నాడు!"

"అతడి గది అడ్రసు తెలుసా?"

"తెలుసు" బోస్ చిరునామా చెప్పాడు.

"చలపతి హత్య విషయంలో మీరు ఏమైనా చెప్ప గలరా?"

"హంతకుడిని పట్టుకోండి. మీ ఫీజు నేను చెల్లిస్తాను."

"థాంక్స్."

"ఖర్చుకోసం వెనకాడకండి!"

"తప్పకుండా. అన్నట్టు మెయిల్‌లో మీతో బాటు బయల్దేరినవాళ్ళెవరు ప్లీజ్ రాసియివ్వండి."

బోస్ కాగితంమీద రాయసాగాడు.

తలుపు దగ్గర అలికిడయింది.

బోస్ తల త్రిప్పి, "కృష్ణా! రా!" అన్నాడు.

కృష్ణ లోపలకు వచ్చాడు.

"చలపతికోసం వచ్చాను సార్!" అన్నాడు కృష్ణ.

బోస్‌కి శిరీష్ కనుసైగ చేశాడు.

"చలపతి ఇక్కడకు రాలేదు!" అన్నాడు బోస్.

"చలపతి ప్రవర్తన ఆశ్చర్యకరంగా వుంది. కూపేలో నన్ను కూడా తోడు రమ్మన్నాడు. తర్వాత వద్దన్నాడు" అన్నాడు కృష్ణ.

శిరీష్ కలగజేసుకొని, "నాకు చలపతి కజిన్ అవుతాడు. చలపతి మిమ్మల్ని చివరి క్షణాల్లో తోడు రావద్దన్నాడు. కారణం చెప్పాడా?" అన్నాడు.

కృష్ణ తటపటాయించాడు. "చెప్పలేదు" అన్నాడు.

"మరి మీకు సీటు ఎలా దొరికింది?"

"రాధికా ప్రొడక్షన్స్ వాసూ ప్రయాణం రద్దు చేసుకున్నాడు. అతడి పేరున నేను బయలుదేరాను."

శిరీష్ లేచాడు. బోస్‌వద్ద కాగితం తీసుకున్నాడు. ఇద్దరిదగ్గరా సెలవు పుచ్చుకుని బయటకు నడిచాడు.

11

శిరీష్ హోటల్‌కి వెళ్ళేసరికి కుమార్ వద్దనుండి ఫోన్ వచ్చింది.

"మద్రాసు జార్జి పేటలో వున్న చలపతి గదిని ఎవరో వెతికారు!" అన్నాడు కుమార్.

"డబ్బు పోయిందా?"

"బాంకులో వుంది డబ్బు. అయిదు వేల రూపాయిల చిల్లర. అదంతా విత్‌డ్రా చేశాడు చలపతి. డబ్బుతోనే బయలుదేరినట్టు ఇక్కడ లైట్‌బాయ్ జయరావ్ చెప్పాడు."

"కేవలం డబ్బుకోసమే హత్య జరగలేదు."

"చలపతి మెయిల్ ఎక్కేముందు రాధికా ప్రొడక్షన్ వాళ్ళ టెలిఫోన్ వున్న గదిలోకి వచ్చాడు. ఆ ఫోన్ నెంబరే అతడివద్ద దొరికిన ఫిలించుట్టలో వుంది కదా!"

"అవును. ఆ ఫోన్ నుండే చలపతికి బెదిరింపు ఫోన్ కాల్ వచ్చి వుంటుంది. అందుకే చలపతి దాన్ని వ్రేలి ముద్రల కోసం ఫోటోలు తీసివుంటాడు."

"హంతకులకు వ్రేలి ముద్రల విషయం తెలీదనుకుంటాను."

"ఎలా? వివరంగా చెప్పు."

"సెంట్రల్ స్టేషన్‌లో చలపతి ఏదో ఫిలించుట్టను జేబులో పెట్టుకుని కనిపించాడు జయరావ్‌కు. తర్వాత ఆ చుట్ట మాయమయిందట. అంటే చలపతి తనని వెంటాడేవారిని నకిలీ ఫిలిం చుట్టతో మోసగించాడన్న మాట. అసలు ఫిలించుట్ట మనకు దొరికిందికదా! పైగా

హంతకులు తమ వ్రేలిముద్రలను నిశ్చింతగా వదలిపెట్టారు."

"గుడ్ లాజిక్. చలపతి గదిలో హంతకుల వ్రేలి ముద్రలు దొరికివుంటాయి."

"అదే చెప్పబోతున్నాను. యిద్దరిలో ఒకడివి దొరికాయి."

"గుడ్. కేసు విడిపోతోంది!"

"కాని మనం వ్రేలిముద్రలతో.... అదే నాకూ అర్థం కావడంలేదు. వ్రేలిముద్రలు పాత నేరస్తులవి కావు!"

"హంతకుడు లేదా హంతకులు ఫిలిం ఫెస్టివల్‌కి వచ్చాడు. చలపతిని వెంటాడాడు. వాల్తేరులో దిగి పని ముగించుకున్నాడు. నాతోబాటే కోరమండల్‌లో తిరిగి ప్రయాణించి వుంటాడు—" బ్రేక్ జర్నీ!

"అయితే అతడికి డ్రెడ్జింగ్ కార్పొరేషన్‌తో పని ఏమిటి?"

"చెబుతాను. నువ్వు వహారా వచ్చెయ్యి ప్లేన్‌లో."

"కాని ఇక్కడ చలపతి గది వెతికినవాళ్ళు...."

"చలపతి ప్రయాణంలో వుండగానే అతడి గది వెతికారు. అంటే ఇద్దరిలో ఒకడు తిరిగి మద్రాసు వెళ్ళిపోయివుంటాడు. ఒకడు ఫెస్టివల్‌లో వుంటాడు. ఇద్దరికీ ఎలిబీలు...." శిరీష్ విజిల్ వేశాడు. "కోరమాండల్‌లో ఒక్కడే వచ్చాడు. అతడు ఎవరో తెలిస్తే.... వాల్తేరు నుండి కోరమండల్‌లో వచ్చినవాడు...." ఆగాడు శిరీష్.

తిరిగి, "కుమార్ వచ్చెయ్యి. ఇక్కడ మన పని చాలా వుంది" అన్నాడు.

రిసీవర్‌లో కుమార్ నవ్వాడు. "నువ్వు ఏ కేసులోనూ ఇంతగా గాభరాపడలేదు" అన్నాడు.

శిరీష్ కూడా నవ్వి, "అవును. ఫోన్ పెట్టేస్తున్నాను!"

అన్నాడు.

శిరీష్ తిరిగి గదిలోంచి బయలుదేరాడు. టాక్సీ మాట్లాడుకున్నాడు. మార్కెట్‌లో ఆగి షాపింగ్ చేశాడు.

'వంగబంధు' ముందు ఆగింది టాక్సీ.

12

డండం విమానాశ్రయంలో కాంటీన్.

క్రైంబ్రాంచ్ డిటెక్టివ్ ఇన్స్‌పెక్టర్ కుమార్ కాఫీ చప్పరిస్తూ చూశాడు.

కుర్చీలో వెనక్కివాలి కణతలు రుద్దుకున్నాడు శిరీష్.

"ఫిలిం ఫెస్టివల్‌కి 'కోరమండల్'లో కూడా చాలా మంది వచ్చారు. అయితే 'మెయిలు'లో ప్రయాణించి బ్రేక్ జర్నీ చేసినవాడు 'కోరమండల్'లో వచ్చినవాళ్ళలో లేడు" అన్నాడు శిరీష్.

"ఒకటే పద్ధతి! ఫిలిం ఫెస్టివల్‌కి మద్రాసునుండి వచ్చిన ప్రతినిధుల వ్రేలిముద్రలు సేకరించాలి."

"చివరి స్టెప్ అదే!" శిరీష్ జేబులోంచి తెల్లటి ఉల్లిపొర కాగితం తీశాడు. దానిమీద ఆకుపచ్చ రంగు సిరాతో రాసివుంది. "బోస్ రాసిన కాగితం. ప్రతినిధుల జాబితా."

కుమార్ కాగితం అందుకుని చదివాడు. అతడి నుదురు ముడతలు పడింది. ప్రక్కనే పెట్టుకున్న బాగ్‌లోంచి కాగితాలు తీశాడు. అవీ వుల్లిపొర కాగితాలే. రెండు వందల అరటావులున్న బొత్తి. ఆకుపచ్చ రంగు సిరాతో రాసి వున్నాయి.

మొదటి పేజీమీద 'ప్రేమ పిచ్చోడు' సినిమా స్క్రిప్టు—కథ, మాటలు, పాటలు, స్క్రీన్ ప్లే, దర్శ

కత్వం—బోస్ అని వుంది.

"ఈ స్క్రిప్టు ఎక్కడ దొరికింది?" అడిగాడు శరీఫ్.

"చలపతి గదిలో."

"బోస్ రాసిన స్క్రిప్టు చలపతి గదిలో దొరికింది. ఈ స్క్రిప్టు ఇంకా సెట్సుమీదకు వెళ్ళివుండదు."

"చలపతికి బోస్ ఈ స్క్రిప్టు ఇచ్చాడేమో."

"బోస్ పేరు ప్రఖ్యాతులున్న దర్శకుడు. తన దగ్గర అసోసియేట్ గా పనిచేసే చలపతికి స్క్రిప్టు యిచ్చాడు."

ఇద్దరూ బయటికి నడిచారు.

టాక్సీ మాట్లాడుకున్నారు.

"సారథిని ఎల్.ఐ.సి. భవనంలో ఇద్దరు హంతకుల ఆచూకీ కోసం పంపించాను. అదే భవనంలో ఇండియన్ ఎయిర్ లైన్స్ ఆఫీసు వుంది మర్చిపోయావా?"

"గుర్తుంది కాని, ఎయిర్ లైన్స్ లో మనకి పని ఏమిటి?"

"మనకు కాదు. హంతకులకు. హైవే మీద వాళ్ళు ప్రయాణించారు."

"నీ ఉద్దేశం అర్థం కావడం లేదు."

"చలపతిలాగానే హంతకులు కూడా బ్రేక్ జర్నీ చేశారు. ఒకడు మాత్రం ఇటు హౌరా వచ్చాడు. రెండోవాడు మద్రాసు వెళ్ళాడు. చలపతి గదిని వెతికాడు. దేనికోసం? స్క్రిప్టుకోసం."

"కాని స్క్రిప్టు గదిలో దొరికింది."

"అక్కడే వుంది మోసం. స్క్రిప్టులో విషయం కావాలి వాళ్ళకు. అంటే ఈ కాగితాలను ఫోటో స్టాట్ కాపీలు తీయించి వుంటారు. తర్వాత స్క్రిప్టును గదిలో పారేశారు. అంటే స్క్రిప్టు దొంగతనం అయినట్టు బోస్

గమనించకూడదు."

"గుడ్. ఎయిర్ లైన్స్ విషయం అర్థమాతోంది."

కుమార్ వాచీ చూసుకున్నాడు.

"మధ్యాహ్నం మూడున్నరకి వైజాగ్ నుండి కలకత్తా వచ్చే విమానం వుంది. దాంట్లో హంతకుడు ప్రయాణించాడన్నమాట."

"హంతకుడు కలకత్తావరకూ ప్లెయిన్ లో రాలేదు."

టాక్సీ వంగబంధు హోటల్ ముందాగింది.

కుమార్, శిరీష్ నాలుగో అంతస్థుకి చేరుకున్నారు. బోస్ గది తలుపు తెరచివుంది.

నేలమీద బోస్ పడివున్నాడు. అతడి భుజంనుండి రక్తం కారుతోంది. శిరీష్ అతడి ముక్కు దగ్గర వ్రేలు ఉంచాడు. తలూపాడు 'ప్రాణానికి మోసంలేదు!' గొణుక్కున్నాడు.

"పిస్తోలుతో ఇతడిని ఎవరు కాల్చారు?" అడిగాడు కుమార్ ఆశ్చర్యపోతూ.

"వంగబంధులో లాడ్జి చేసిన వాళ్ళ వ్రేలిముద్రలు సేకరించుదాం. బోస్ కూడా షూట్ చేసిన వాళ్ళను చూచి వుండడు. చూచి వుంటే అతడిని ప్రాణాలతో వుంచే వాళ్ళుకాదు!"

కుమార్ క్రిందకు పరుగెత్తాడు.

శిరీష్ తలవంచి బోస్ వద్ద వంగాడు.

బోస్ పెదిమలు కదులుతోన్నాయి.

13

సఫ్దర్ జంగ్ లోని ఫొరెన్సిక్ లాబొరేటరీ రద్దీగా వుంది. మొత్తం మూడువందలమంది ఫిలిం ఫెస్టివల్ ప్రతినిధుల వ్రేలిముద్రలు ప్రోసెసింగ్ లో వున్నాయి.

కలకత్తా మహానగరంలోవున్న వ్రేలిముద్రల నిపుణులు అక్కడే వున్నారు. ఒక బృందం వారితోబాటు శిరీష్ వున్నాడు. ఆ గదిలో వ్రే లి ము ద్ర ల ను సరిపోల్చు తున్నారు.

శిరీష్ తనకి చలపతివద్ద దొరికిన ఫిలింలోని వ్రేలి ముద్రల సెట్టుతో సిద్ధంగా వున్నాడు.

ఏదెనిమిది గంటల పరిశ్రమ తర్వాత శిరీష్ ఫోన్ వద్దకు నడిచాడు.

హోటల్ 'వంగబంధు'కు ఫోన్ చేశాడు.

కలకత్తా పోలీసుల సహకారంతో కుమార్ 'వంగ బంధు'ను పూర్తిగా గస్తీ ఏర్పాట్లతో బంధించాడు.

"కుమార్! రూం నెం. 90లో వున్న కృష్ణను అరెస్టు చెయ్యి. అతడే చలపతిని లాడ్జి త్రివేణిలో హత్య చేశాడు. బోస్‌ను కాల్చింది కూడా అతడే. అతడివద్ద హత్యకు వాడిన పాయింట్ త్రీ టూ కాలిబర్ పిస్తోలు దొరుకుతుంది" అన్నాడు శిరీష్.

* * *

"నేను ఈ హత్య చేయలేదు!" అరిచాడు కృష్ణ.

"చలపతి హంతకుడిని గుర్తించాడు. బాగా పరిచయం వున్న హంతకుడిని చూచి చలపతి ఆశ్చర్యం ప్రక టించాడు. అందుకే చలపతికి బాగా సన్నిహితులమీద పరిశోధన సాగించాం. చలపతి స్క్రిప్టు దొంగలించాడు. బోస్ రాసిన స్క్రిప్టు 'ప్రేమ పిచ్చోడు' చలపతి గదిలో దొరకడాన్నిబట్టి వ్యవహారం అర్థమయింది.

నువ్వూ నీ పార్టనరూ కలసి చలపతిని ఫోన్ కాల్స్ ద్వారా బెదిరించారు. బోస్ రాసివుంచుకున్న స్క్రిప్టులో 'ప్రేమ పిచ్చోడు' దొంగిలించేలాగా అతడిని తరిమారు.

స్క్రిప్ట్‌తో అతడు కలకత్తా వెళ్తోన్నట్టు వూహించు కున్నారు.

లాడ్జి త్రివేణిలో అతడిని హత్యచేసి బాగ్ వెతికారు. స్క్రిప్టు దొరకలేదు. నువు కలకత్తా వచ్చావు. నీ పార్ట్‌నర్ మద్రాసువెళ్ళి చలపతి గది వెతికి స్క్రిప్టు సంపాదించాడు. మరల స్క్రిప్టును అతడి గదిలో పడ వేశాడు. విషయాన్ని ఫోటోస్టాట్ కాపీద్వారా సంగ్ర హించాడన్నమాట" అన్నాడు శిరీష్.

కృష్ణ అసహనంగా కదిలాడు. "కాని నేను మెయిలులో హౌరాలో దిగాను. నేను ఎక్కడా బ్రేక్ జర్నీ చేయలేదు. ఆ విషయాన్ని టికెట్ ఎగ్జామినర్ సహాయంతో రుజువు చేయగలను" అన్నాడు.

"నీ వ్రేలి ముద్రలు లాడ్జి త్రివేణిలో దొరికాయి. ప్రపంచంలో ఒకరి వ్రేలిముద్రలనుపోలిన వ్రేలిముద్రలు వుండవు."

"నాకు తెలియదు. అవి నా వ్రేలిముద్రలు కావు."

"మెయిలులో నువు బ్రేక్ జర్నీ చేశావు. నువ్వూ నీ పార్ట్‌నర్ కలిసి జాన్, లింకన్ పేర్లతో చలపతికంటె ముందుగా లాడ్జి త్రివేణిలో దిగారు. చలపతి నాకు ఫోన్‌లో చెప్పిన విషయాలు టాప్ చేసి వినివుంటారు. చలపతిని అనుకున్నట్టుగా హత్యచేశారు. నువు కలకత్తా ప్లెయిన్‌లో ముందురోజు ఫోన్‌లో ఒక ఎయిర్ టికెట్ బుక్ చేసుకున్నావు. టికెట్ భువనేశ్వర్ వరకూ."

"అబద్ధం!"

"ఎల్. ఐ. సి. భవనంలో వున్న ఎయిర్‌లైన్స్ ఆఫీసులో దర్యాప్తు చేశాం. 648791 మద్రాసునుండి టికెట్ రిజర్వు చేయమని కాల్ వచ్చిందని ఆఫీసులో

రికార్డయింది. విమానంలో మెయిలుకంటె ముందుగా నువు భువనేశ్వర్ చేరుకున్నావు. ప్రైవేట్ సెక్రటరీ... రైల్వే స్టేషన్‌కి చేరుకున్నావు. మెయిలులో యథాప్రకారంగా నీ బెర్త్‌ను ఆక్రమించుకున్నావు."

తలను అరచేతులతో కప్పుకుని, "ఇదంతా రాధికా ప్రొడక్షన్స్ వాసూ వలన జరిగింది. నేను జాన్ పేరా, అతడు లింకన్ పేరా వ్యవహరించాం ....పిస్తోలుతో బోస్‌నూ, చలపతినీ నేనే కాల్చాను."

శిరీష్ పెదిమలు బిగించి చూశాడు. "బోస్ రాసిన 'ప్రేమ పిచ్చోడు' స్క్రిప్టును దొంగిలించారు. అటువంటి ప్రేమ కథలు గంటకు నాలుగు చొప్పున రాసిపెట్టే రచయితలున్నారు. దొంగతనం చేసినప్పటికీ మీ పని నెరవేరలేదు! నయం! బోస్ బతికాడు!" అన్నాడు అతడిని అసహ్యంగా చూస్తూ.

—:ఐ పో యిం ది:—